# సాయి సందేశము: ప్రేమ సందేశము

విద్యార్థులారా!

ప్రేమయే ప్రాణము. ప్రేమకు మించిన పదార్థము జగత్తులో కానరాదు. ప్రేమకాని పదార్థము మరొక్కటి కనిపించదు. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిధిదేవో భవ అని అన్నింటికంటె మొట్టమొదట మాతృదేవి ప్రేమను కురిపిస్తుంది. మన సంస్థలలో, మన విద్యాలయములలో ప్రేమయే ప్రధానమని ప్రబోధించి, ప్రచారము సల్పే విద్యార్థులకు నేను మరొకతూరి ఏమీ చెప్పనక్కరలేదు. ప్రేమ వెన్నెల వంటిది. చల్లదనాన్ని హృదయానికి అందిస్తుంది. ప్రేమ మధురమైన మాధుర్యాన్ని కురిపిస్తుంది. మాటలలో ప్రేమ, చూపులలో ప్రేమ, కర్తవ్యములో ప్రేమ. అన్నింటియందు ప్రేమయే ప్రాణముగా నిల్చి, ఆప్రేమ చేతనే జీవితాన్ని గడుపుతూ రావాలి. ప్రేమ లేని జీవితము కేవలము అంధకారమే. నిరుపయోగమే.

కనుక, మీకు నేను అందించునది ప్రేమ ఒక్కటే. నాకు తిరిగి మీరు అందించునది ప్రేమ మాత్రమే. ప్రేమకు సాటి మరొకటి లేదు. ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. ఇట్టి ప్రేమను మీరు ఏవిధంగా అనుభవించాలి? జీవితము ప్రేమ రహితమైన జీవితము. అట్టి ప్రేమ రహితమైన జీవితాన్ని ప్రేమసహితమైన జీవితముగా మార్చుకోటం, యిదియే నిజమైన విద్యావిధానము. విద్య అనగా ఏమిటి? కేవలము తెలివి అనుకుంటున్నారు. తెలివితేటలతో కర్తవ్యమును ముగించి, గమ్యాన్ని సాధించి, ప్రేమను వరించి జీవితాన్ని తరింపచేసుకోటమే నిజమైన విద్య.

ఆనాటి గోపికలు అనేక రంగములందు ప్రవేశించి, తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండునంత వరకు ప్రేమ చేతనే వారి వారి కాలాన్ని సార్థకము గావిస్తూ వచ్చారు.

ప్రేమ రహితమైన మరుభూములలో
　　ప్రేమాంకురములు పెంపొందా
ప్రేమావేశముతో ప్రేమసుధా వర్షము
　　వర్షింపగ ప్రేమనదులు ప్రవహింపగ
మురళీ గానము చేయగదే! కృష్ణా! గానము చేయగదే...

గోపికలందరూ పాడారు. కృష్ణా! నీ ప్రేమ కంటె మించినది ఏముంది? అందుకోసమే రాధ కూడా చెప్పింది.

పాటపాడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల
　　పలుకు తేనెలొలుకునటుల
మాటలాడుమా ముకుంద! మనసు తీరగ!
వేదసారమంత తీసి నాదబ్రహ్మముగను మార్చి

ప్రేమయందు తిరుగబోసి ప్రేమతత్వము పెంచవోయి
పాటపాడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల
పలుకు తేనెలొలుకునటుల....

విద్యార్థులారా! నిండుగా ప్రేమ లేకుండిన దేనికోసం బ్రతుకుతున్నారు? ప్రేమ నిమిత్తమే మీరు బ్రతుకుతున్నారు. ప్రేమను సాధించే నిమిత్తమై యీ చదువులు చదువుతున్నారు. అన్నింటియందు ఉన్నది ప్రేమ ఒక్కటే.

మీ అందరి ఆనందమును నేను గ్రోలేటప్పటికి లేవటానికి కూడా వీలుకాని స్థితి పొందింది. దీనికంతటికీ ప్రేమయే ప్రధానమైనది. ఈ ప్రేమకు మించినది జగత్తులో మరొక్కటి కానరాదు. నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన లేత వయస్సు నందు, ఈ పవిత్రమైన జీవితాన్ని ప్రేమచేతనే సార్థకము గావించుకోవాలి. కానీ వయస్సు పెరిగే కొలదీ యీ ప్రేమ అనేక రంగములలో ప్రయాణము చేస్తుంది. సక్రమమైన మార్గము వదలి వక్రమమైన మార్గములో ప్రయాణము చేస్తుంది. కనక యీ ప్రేమను, యీ లేత వయస్సునందే చక్కగా పెంచి, యేవిధమైన వంకరటింకరలు లేక ఆనందముచేత ఆ పరమాత్మునిలో లీనమయ్యే విధానము నేర్చుకోవాలి. అదియే నిజమైన భక్తి. భక్తి అనగా ఏమిటి? కేవలము ప్రేమ యొక్క ప్రతిబింబమే భక్తి. ప్రేమ లేక భక్తి కానేరదు. ఈ భక్తి, శక్తి, యుక్తి, రక్తి, విరక్తి, అనురక్తి, ముక్తి అన్నింటినీ చేకూరుస్తుంది యీ ప్రేమ. ప్రేమ లేక ముక్తియే లేదు. ప్రేమ లేక రక్తియే లేదు. ఈ ప్రేమ లేక విరక్తియే రాదు. ఈ ప్రేమ లేక యేదీ మనము సాధించలేము. ప్రేమ చేతనే మనము సర్వమూ సాధించుటకు వీలవుతుంది.

అన్నింటికంటె మొట్టమొదటది మాతృప్రేమ. తల్లిప్రేమను మీరు సాధించండి. కని, పెంచి, పెద్దచేసి అన్నివిధాలా అభివృద్ధికి తోడునీడ అయినది మాతృదేవి. అట్టి మాతృదేవిని మర్చిపోకుండా మీరు నిరంతరము మాతృప్రేమను పెంచుకోండి. ఆ మాతృప్రేమ చేతనే దివ్యమైన దైవప్రేమకూడా మీరు పొందగలరు. దైవముకూడా మాతృదేవే. దేహానికి మాతృదేవి ఒక్కటే. దేశానికి మాతృదేవి ఒక్క భగవంతుడే. కనుక, ఏకాత్మ భావముతో కూడిన భగవంతుని మీరు స్మరించాలి. ఏకాత్మ భావము ఒక్క భగవంతునికి మాత్రమే ఉంటున్నాది. మీరు అనుకుంటారు. లోకములో అనేక రకములైన ప్రేమలుంటున్నాయని. ఈ అన్ని ప్రేమలు వ్యర్థమైనవే. ఇవన్నీ కేవలము సార్థకము గావించేవి కావు. నిజమైన ప్రేమ ప్రవృత్తి మార్గం కాదు. నివృత్తి మార్గము. లోకములో తల్లి, తండ్రి, తమ్ముడు, భార్య అందరూ ఉంటారు. కానీ యీ ప్రేమలన్నీ ప్రవృత్తిలో ప్రవేశిస్తాయి. ప్రవృత్తి అనగా లౌకికమైన వృత్తి. ఏదో ఒక దేహానికి, మరొక దేహానికి భార్య భర్త అనిపిస్తుంది. ఒక దేహానికి మరొక దేహానికి తల్లి బిడ్డ అనిపిస్తుంది. ఒక దేహానికి మరొక దేహానికి అన్న తమ్ముడు అనుకుంటూ వస్తున్నాము. కానీ భగవంతుడు అన్నింటికీ తానే. ఏ రంగము పోయినప్పటికీ, ఏ స్థితిలో జీవించినప్పటికీ దైవత్వమును ఒక్క ప్రేమతత్వముతోనే పూజించాలి. ప్రేమతత్వముతోనే భజించాలి. ప్రేమతత్వముతోనే నిరూపించాలి. ప్రేమకు మించినది మరొకటి లేదు కనుక మీరు పెంచుకోవలసినది ప్రేమతత్వమే.

విద్యార్థులు వేరువేరైనప్పటికీ ఒకరినొకరు ప్రేమించుకోవాలి. ఒకరికొకరు అన్యాయాలకు పోకుండా, అక్రమాలకు పోకుండా ఆదరించుకుంటూ రావాలి. కష్టములతో, నష్టములతో, బాధలతో ఉండిన విద్యార్థులను

ఆదుకోవాలి. అట్లాంటి ఆదుకునే తత్వమును సాధించినప్పుడే మీరు దైవత్వాన్ని పొందగలుగుతారు. కనుక, ప్రేమకు మించినది మరొకటి లేదు. ప్రేమ బ్రహ్మాండమును కూడా మింగివేస్తుంది. ప్రేమకు మించినది మరొక్కటి లోకములో కానరాదు. భజనలు చేస్తున్నారు, ధ్యానములు చేస్తున్నారు. కానీ యివన్నీ ప్రేమలేక ప్రయోజనము లేదు. ప్రేమ అంతర్వాహినిగా ప్రవహిస్తూ ఉంటుంది. గంగ, యమున, సరస్వతి మానవుని హృదయములలో ప్రవహించే ప్రధానమైన ప్రవాహములు. గంగ, యమునలు ప్రాణ దేవతలు. వీటికి అంతర్వాహినిగా జ్ఞానమనే సరస్వతి. ఆ సరస్వతియే మీ విద్య. ఈ విద్య అంతర్వాహినిగా ప్రవహించేదేగానీ బహిర్ముఖముగా ప్రవహించేది కాదు. ఈ రెండింటినీ కాపాడుకుంటూ కేవలం అంతర్వాహినిగా ప్రవహించే విద్యకోసం మీరు యిక్కడకు చేరారు. జ్ఞానము పొందుతున్నారు. అది కనిపించటం లేదు. పుస్తకాలు చదవటము, విషయాలు తెలుసుకోటము, వల్లించుకోటము వీటితో మీ కాలాన్ని గడుపుతున్నారు. ఇవికూడా ప్రాకృతమైనవి, భౌతికమైనవి, లౌకికమైనవి. ఇవి కాదు మనం సాధించవలసినవి. దీనితోబాటు అంతర్ముఖమైన ఆత్మతత్వమును కూడా ప్రవహింప చేసుకోవాలి. ఈ విద్యలలోపల ప్రేమతత్వాన్ని పోషించుకున్నప్పుడే అది నిజమైన భావతత్వంగా మారిపోతుంది. అదే రాగతత్వంగా మారిపోతుంది. అదే ముక్తితత్వంగా మారిపోతుంది. అదే ముల్లోకములు తిరుగుతుంది. అట్టి ప్రేమతత్వాన్ని మీరు మొట్టమొదట సాధించాలి.

సాయి ప్రేమతత్వము అట్లే. కృతయుగంలో ధ్యానం చేసారు. దేనికోసము? మనస్సు పవిత్రం గావించుకొనేకోసం. త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు చేశారు. ఎందుకోసం? కేవలం మనస్సు పరిశుద్ధం గావించుకునే నిమిత్తమే. ద్వాపరయుగంలో అర్చనలు గావించారు. ఈ అర్చనలు దేనికోసం? ఆత్మనివేదనకోసం గావించారు. కానీ కలియుగంలో ప్రేమ ఒక్కటే. ఈ ప్రేమచేత పవిత్రమైన స్థితి పొందవచ్చు. ప్రేమచేత ఎంత ఘనమైన స్థితినైనా సాధించగలదు.

కనుక, కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగములకంటె కలియుగము చాలా సార్ధకమైనదిగా మీరు భావించాలి. పవిత్రమైన హృదయాన్ని విశ్వసించాలి. సులభమైన మార్గములు లభిస్తున్నాయి. యజ్ఞయాగాదులు చేయుటకు శరీరశక్తి లేకపోవచ్చును. కానీ ఎట్లాపోయినప్పటికీ, నడచుకుంటూ పోయినప్పటికీ, అన్నంతింటున్నప్పటికీ నామస్మరణ చేయటానికి ఎట్టి అభ్యంతరము లేదు.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా.

దీనికంటె మించినది మరొకటి లేదు. కనుక నామస్మరణ గావించుకుంటూ ఎక్కడికైనా వెళ్లండి. ఏ దేశమునకైనా వెళ్లండి. దేశాలంతా తిరిగి అలసిపోయి వచ్చినాము మాకింక దిక్కు లేదని పాడారు. దేశములు తిరిగాయా? లేదే. కానీ దేహాలు తిరుగుతున్నాయి. ఈ దేహమునుంచి యింకొక దేహము. దేహాలు తిరుగుతున్నాయి కానీ దేశాలు తిరగటం లేదు. ఎన్ని దేహాలు మారినా దేహి ఒక్కడుగానే ఉంటున్నాడి.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్

మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా

దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఆ దేహియే దేవదేవుడు. దేహాలు మారినా దేహిని మాత్రం మనం మార్చకుండా స్థిరము గావించుకొనుటకు ప్రయత్నించాలి. నిశ్చల, నిర్మల, నిస్వార్థమైన ప్రేమతత్త్వమే దేహియొక్క స్వరూపము. కనుక, ఆ దేహి స్వరూపాన్ని మీరు పొందటానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను. అన్ని క్లాసులలో కూడా మంచి ఉత్తమశ్రేణిలో ఉన్నతవిద్య పొంది ప్రపంచమునకు ఆదర్శమైన విద్యార్థులుగా మీరు రూపొందాలని నేను ఆశిస్తున్నాను.

అమెరికాకు యిద్దరు పిల్లల్ని పంపించాం. శ్రీరాంపరశురాం, ప్రవీణ. రాంశెట్టి గొప్ప డాక్టరు. త్యాగజీవి. యోగజీవి. కోట్లకు ధనమున్నప్పటికీ ఒక్క నయాపైసా పెట్టుకోడు. త్యాగం, త్యాగం.. ఆ పిల్లలను అతని దగ్గర పెట్టుకొని పోషిస్తున్నాడు. ఆ పిల్లలు మన కాలేజీ పిల్లలు. ఎక్కడ అమెరికా ఎక్కడ పుట్టపర్తి! పుట్టపర్తి కుగ్రామము నుండి పోయిన పిల్లలు అమెరికాలో చాటుతూ వచ్చారు మన విద్యాలయము యొక్క తత్త్వమును. ఒక్కొక్కరు 95% మార్కులు తెచ్చుకున్నారు. అక్కడున్న టీచర్సు చాలా ఆశ్చర్య పడ్డారు. ఇండియానుండి వచ్చిన చిన్న పిల్లలు ఎంత విద్యావంతులుగా ఉంటున్నారు! భక్తి ప్రపత్తులు కూడా అధికంగా ఉంటున్నాయి. ఇక్కడ చదివినందుకు స్వామికి యిలాంటి సత్కీర్తి తీసుకు రావటమే నాకు నిజమైన ముడుపు. స్వామి ఏమీ కోరటంలేదు. ఏమీ ఆశించటం లేదు. మీరు మంచిపేరు తెచ్చుకోవటమే చాలా ముఖ్యమైనది. అమెరికాలోపల మంచిపేరు వచ్చింది. ఇట్లాంటి ఆదర్శవంతమైన పిల్లలు వస్తే మేము ఆనందిస్తామని అక్కడ టీచర్సు మెచ్చుకున్నారు. మీరుకూడా దేశములు తిరిగి రండి. పిక్నిక్‌లకు పోయి తిరిగి రావటం కాదు. ఆదర్శమునందించి, అందరికీ చాటి, ప్రేమతత్త్వాన్ని ప్రబోధచేసి, దానికి మొలకలు మొలిపించి ఆనందాన్ని అందరికీ పంచాలి. అదే నిజమైన ప్రేమతత్త్వము. కనుక, మీరు ఆ ప్రేమను హృదయపూర్వకంగా పెంచుకోండి. ఏదిలేకపోయినా ప్రేమ ఒక్కటుంటే చాలు. అది నిర్మల, నిశ్చల, నిస్వార్థమైనదిగా ఉంటే స్వామి ఎప్పుడైనా కట్టుబడతాడు.

12వ తరగతి విద్యార్థి చెప్పాడు, 'మూడు సంవత్సరములనుంచి స్వామి నా ముఖం చూడలేదు. నాన్నగారు వచ్చారు, మాట్లాడలేదు'. మాట్లాడవలసిన అవసరమేముంది? చేయవలసినది చేస్తున్నాను. మెడిసన్ సీటు వచ్చేటట్లు చేశాను. రెండవ సంవత్సరం చదువుతున్నాడు. వారు నాకు చెప్పలేదు. కానీ అన్ని పనులు చేస్తున్నాను. మాట్లాడకపోతే నష్టము ఏమిటి? ఏమీలేదు. కానీ మీరుకూడా తగిన కృషి చేయాలి. స్వామి సన్నిహితంగా పోవటానికి, స్వామితో మాట్లాడటానికి, స్వామి ప్రేమ పొందటానికి, స్వామి ఆనందము అనుభవించటానికి కృషి చేయాలి. ఆ కృషి మీరు చేయకుండాపోతే ఉండి ప్రయోజనం ఏమిటి? కనుక మీరు యిక్కడకు వచ్చినందుకు ఆ ప్రేమను మీరు పంచుకొని, ఆ ప్రేమను మీ హృదయంలో నిల్పుకొని ప్రపంచానికి చేరాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ మీ తల్లిదండ్రులకు తగిన ఆనందమును యిమ్మని కోరుతూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

శ్రీసత్యసాయి హయ్యర్‌సెకండరిస్కూల్ హాస్టల్‌లో

శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము. 26.02.2002